# శృతి లయలు

-ఐలేని గిరి

అరగంట నుంచి ద్వారం దగ్గర అతనికోసం ఎదురుచూస్తోన్న ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి. అరవింద్ షూ విప్పి కాళ్ళూ చేతులూ మొహం కడుక్కుని వచ్చి వాలుకుర్చీలో సేద తీరేలోపున, రజనీ వేడి వేడి టీతో వచ్చి అతనిపక్కన కూర్చుంది.

అతను ఆలస్యానికి కారణాలు చెబుతూ టీ సేవిస్తున్నంతలో రొటీన్‌గా పవర్‌కట్. అప్పటికి సాయంత్రం ఏడు గంటలవుతోందని పట్టణంలో అందరికీ చెప్పకనే తెలుస్తుంది.

అరవింద్, రజని రోజూలాగే కుర్చీలు బాల్కనీలో వేసుకుని కబుర్ల కళ్ళెం వదిలి పెట్టారు.

ఆ రోజు బ్యాంకులో విశేషాలూ, ఓ రోజు అటూ ఇటూగా జరిగిన సంఘటనలూ అతను చెబుతుంటే, ఆ రోజు చుట్టు పక్కల ఇళ్ళలోని విశేషాలకి కొంత మసాలా జోడించి వీలైనంత సహజంగా ఉండేట్టు ఆమె చెబుతూ - అలా బాల్కనీ సమయం గడిచి మళ్ళీ గదిలోకి విద్యుత్తుతోపాటు వాళ్ళూ వచ్చారు.

గిన్నెలచుట్టూ ఆమె. ఆమె చుట్టూ అతను. అర గంటలో వంటసిద్ధం. వాళ్ళ సంసారంలానే రుచికరమైన వంటకం. ఉప్పూకారం మసాలా అన్నీ కలిసిన రుచికరమైన వంటకం.

డైనింగ్ టేబుల్ అలంకరించిన వధువైతే, తాకట్టు పెట్టడానికి భార్య మీది ఒక్కో వస్తువుని ఒలుచుకునే జూదరుల్లా ఇద్దరూ భోంచేస్తూ టేబిల్‌మీద బరువు తగ్గిస్తున్నారు.

ఇంతలో అరవింద్ దృష్టి అటకమీద అమర్చిన పెద్దసైజు ప్యాక్ మీద పడింది.

"రజనీ! అదేంటీ?" అడిగాడు భ్రుకుటి ముడిచి.

అతడు దేన్ని గురించి అడుగుతున్నాడో ఆమెకు తెలుసు. అయినా ఎరగనట్టు 'ఏదీ?' అంది.

"అదే ఆ అటకమీద ఉన్న ప్యాక్!" అతని మాట ఎక్కుపెట్టిన బాణంలా ఉంది.

ఈ సీన్ ఉంటుందని రజనీకి ముందగానే తెలుసు.

"ఔనండి; ఆ స్టీలు షాపులో మన పాత ద్యూస్ క్లోజయింది కదా! ఎప్పట్నించో మిక్సీ కొందామని మీతో చెబుతున్నా కదా. పైగా డబ్బు ఇన్‌స్టాల్‌మెంట్సులో ఇచ్చేదే కాబట్టి మనకు ఇబ్బందిగా ఉండదని మీకు చెప్పకుండా తెచ్చాను. అయాం సారీ."

అరవింద్‌లో మునుపటి ప్రశాంతతా, ఓపికా నశించాయి. ఙ్ఞానాన్ని వదలిపెట్టాడు.

"ఇన్‌స్టాల్‌మెంట్స్ అంటే డబ్బు కట్టనక్కర్లేదా? నీకేం తెల్సు నాకెన్ని సమస్యలో. ఇప్పటికే నేను ప్రతినెలా



బోలెడు అడ్జస్ట్‌మెంట్సు చేయాలి. దానికి తోడు ఏదో ఒకటి ఇలా చెప్పకుండా తెచ్చుకోవడాలు. అదీ చిన్న ఐటంకాదు. కనీసం పదిహేనువందలైనా ఉంటుంది."

"కాదండీ కేవలం పన్నెండొందలే. అయినా మీకు ఇబ్బందయితే నేను సగం డబ్బులు కడతాలెండి. మా నాన్నగారు నాకు ఈ దీపావళికి చీర తెస్తానన్నారు. చీరకు బదులు డబ్బే ఇమ్మంటాను. ఆ డబ్బు దీనికి కడతా లెండి." అంది రజని కాస్తమెల్లగా.

అరవింద్‌కి చిర్రెత్తుకొచ్చింది. "చాల్లే, ఇంతక్రితం మీ అమ్మావాళ్ళకోసమని వాటర్ ఫిల్టర్ తీసుకున్నావు కదా! ఆ డబ్బులు నెలనెలా వాళ్ళే ఇస్తారని అన్నీ నాతోనేకట్టించావు. నీకు డబ్బంటే విలువలేకుండా పోయింది. చీరల షాపులో ఎప్పుడూ బాలెన్సు వెయ్యి రూపాయలకి తగ్గదు. ప్రతినెలా వాడికి ఇవ్వాల్సిందే. ప్రతిరోజూ ఇంటి ముందరికి వచ్చే బొమ్మలూ, స్టీలు సామాన్లు ఉన్న బండిలోంచిఏదో ఒకటి తీసుకుని ఇరవై - ముప్పయి రూపాయలు తగలేస్తావు. పైగా అందరూ కొన్నారని సంజాయిషీ. ఈ ఇన్‌స్టాల్‌మెంట్స్‌తో నా జీతం ఎటూచాలక ఇప్పటికే అప్పు ఓ ఇరవైవేలయింది. డబ్బులెక్కణ్ణించి వస్తాయను కుంటున్నావు. దుబారా చేయడం సులభమే. ఆదా చేయడమే కష్టం."

ఆగకుండా అతడు చెప్పే మాటల్తో రజనీకి కూడా కోపమొచ్చింది. ముఖ్యంగా తన వాళ్ళ గూర్చి చులకనగా మాట్లాడినందుకు ఆమె చాలా ఫీలయింది."

మీ అప్పంతా నావల్లనే అయినట్టు మాట్లాడతారేం. చీరల షాపులో మీ చెల్లాయికి మొన్ననేకదా ఓ ఖరీదయిన చీర ఇప్పించారు. అంతకుముందు ,మీ అన్నయ్య పిల్లలకు డ్రెసెస్‌కూడా తీసికెళ్ళారు కదా! అవన్నీ నేనే చేయించినట్టా? ఎవరి కోసమో అప్పులు చేసి అవన్నీ నామీద తోస్తారేంటి. మా వాళ్ళంటే మీకు అంత చులకన. అదే మీ వాళ్ళకోసమైతే ఈ లెక్కలు చెప్పరు. అయినా మీ బోడి డబ్బులు నాకేం ఇవ్వనక్కర్లేదు. మా నాన్నగారినడిగి మొత్తం ఇన్‌స్టాల్ మెంట్స్ నేనే కట్టేస్తా." అంది అక్కసుగా.

"మీ నాన్నగారి నడిగే రోజూ ఈ ఇంటి ఖర్చులు పెడుతున్నావు. అటకపైన స్టీలు సామాన్లూ, షెల్ఫుల్లో బొమ్మలూ అన్నీ కొనడానికి ఆయనే డబ్బిస్తున్నారు." అన్నాడు అరవింద్ ఎద్దేవగా.

"అవునుమరి మీరు ఆఫీసులో అర్థమైన వాళ్ళకి టీ తాగించడాలూ, వారానికో, పదిహేను రోజులకో మందు పార్టీకి పెట్టే డబ్బులూ, ఎవరైనా ఫ్రెండ్‌వస్తే సత్కారాలూ, ఇవన్నీ ఖర్చుకిందకి రాదు. ఓ పదిరూపాయలు, ఇరవైరూపాయల వస్తువు మేం ఖరీదు చేస్తే అది మీకు ఖర్చు. మీరు స్కూటరులో పెట్రోలు వేయించుకొని చక్కర్లు కొడితే ఖర్చుకాదు. అవన్నీ మీకు లెక్కల్లోకి రావు." అంది రజని విసురుగా ప్లేటుని పక్కకి తోసి.

ఆమె చెప్పినమాటల్లో నిజం ఉంది కాబట్టి, అరవింద్‌లో కాస్త మెతకదనం వచ్చింది. నిజానికి రజనీకి తెలియని ఖర్చులు కూడా కొన్ని తను చేస్తుంటాడు. స్టాఫ్‌తో కలిసి కట్‌మిర్చీలు తినడం, గప్‌చిప్‌లు తినడం, దాబా హోటల్‌కి వెళ్ళడం, ఏ చిన్న ఖర్చయినా పది రూపాయలకి తక్కువగా ఉండదు. ఇంకానయం, సిగరెట్టు తాగే అలవాటు ఉన్నవాళ్ళయితే ఆ డబ్బుల్తో ఇంట్లోకి ఎన్నో ఐటమ్స్ కొనొచ్చు. పురుషుని హోదాలో ఇవన్నీ సమర్థించుకోడానికి బాగానే ఉన్నా, ఆత్మ పరిశీలన చేసుకుంటే సిగ్గుపడాల్సిన విషయమే.

అయినా బెట్టు సడలకుండా అరవింద్ విసురుగాలేచి "ఛీ, ఛీ ఎప్పుడూ ప్రశాంతంగా తిన్నది లేదు" అంటూ చేయి కడిగేసుకుని బెడ్డు మీదికి చేరాడు.

రజనీమాత్రం, కోపంతో అవమానంతో గొణుక్కుంటూనే అంట్ల గిన్నెలు కడిగి మరోసారి ఇల్లు శుభ్రంగా ఊడ్చి, తలుపులు మూసేసి, వంటగదిలో, హాలులో స్విచెస్ తీసేసి పడుకుంది.

ఇద్దరు పడుకుంది ఒకే బెడ్‌పైనే అయినా మనసులు మాత్రం ఒకర్నొకరు తిట్టుకుంటున్నాయి. అలా అశాంతిలో ఓ పదినిమిషాలు ఇద్దరూ అటూ ఇటూ కదిలారు. అరవింద్‌కి క్రమంగా కోపం స్థానంలో వివేచన మొదలై మామూలు స్థితిలోకి వచ్చాడు.

అందుక్కారణం చీకటి అవసరం కావొచ్చు. రజని అటువైపునుంచి ఇటువైపు తిరుగుతుందేమో ఒంటిపై చేయి వేద్దామను కున్నాడు కాని పురుషాహంకారం. తనే తప్పు చేయలేదు. పైగా తానే లొంగిపోతే ఇంకా ఇలాంటి వస్తువులు ఎన్నో కొనివ్వాల్సి వస్తుంది. ఇంకాసేపు ఆగి చూద్దాం అనుకున్నాడు.

రజనీ కోపంతో ఉడికిపోయింది. అటు తిరిగితే తనకోపం చల్లారొచ్చు. కోపం చల్లారితే అతనిది పైచేయి అవుతుంది. అవసరమైతే రోజూలాగే తనే పలకరిస్తాడు. లేదా చెయ్యో కాలో తగిలిస్తాడు. అప్పుడు చెప్పొచ్చు సంగతి అనుకుంది.


ఇంకొద్ది సేపట్లో పలకరిస్తాడేమో అన్న ఫీలింగ్‌తోనే ఆమె నిద్రలోకి జారుకుంది. ఇటు ఆఫీసు పనివల్ల కలిగిన అలసటతో, ఇంట్లో చికాకులూ అరవింద్‌కి కూడా నిద్రవొచ్చేసింది.

కానీ చీకటి బలీయమైంది. అర్థరాత్రి దాటింతరవాత అనుకోకుండా అరవింద్‌కి మెలకువొచ్చింది. పక్కన రజనీకర మోహనబింబం నిద్రలోఉంది. సగం అనాచ్ఛాదితంగా ఆమె వక్షస్థలం. అతనిలో కలకలం. దగ్గరగా జరిగి ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకుని నడుమ్మీద చేయివేశాడు.

ఆ స్పర్శకి ఆమెకి మెలకువొచ్చింది. అప్పటికే ఆక్రమించుకుంటోన్న అతడు 'రాత్రి తిట్టారుగా! సిగ్గులేకుండా ఇదేంటి' అనబోతున్న ఆమె కెంపు పెదవులకు సంకెళ్ళు వేసి ఆమెను మొత్తంగా అరెస్టు చేశాడు.

బెడ్‌పక్కన అమర్చిన పెయింటింగ్ చంద్రుడికి ఈ కృత్రిమ కోపతాపాల్ని చూసి ఆశ్చర్యమేసింది.

ఐలేని యాదగిరి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్
సిద్దిపేట, మెదక్ జిల్లా




కె.బి. భార్గవాచారి, హరివరం (పోస్ట్), కోవెలకుంట్ల (తాలూకా), కర్నూల్ జిల్లా - 518 139.